# 24. సంఘద్రోహి

ఆ సాయంత్రమే 'నాటర్ డామ్' అనే ఓడ - మార్సెల్లీస్ ఓడరేవు జేరింది. రేవులోని పనులు పూర్తయ్యాక, పదిమంది నావికులు - ఆ రాత్రి పట్టణంలో గడిపేందుకు కాప్టెన్ దగ్గర అనుమతి తీసుకున్నారు.

అప్పటికే చీకటిపడ్డది. పట్టణంలోని విద్యుద్దీపాలు అతికాంతివంతంగా వెలుగుతున్నాయ్. రాత్రి భోజనానికి గాను తయారు కాబడే వంటపదార్థాల వాసనలతో వీధులన్నీ నిండుతున్నయ్. వీధుల్లో వడివడిగా పరుగులెత్తే బళ్ళ చక్రాల శబ్దాలూ, బళ్ళవాళ్ళ కొరడా విదిలింపులూ, ప్రజలుచేసే గందరగోళమూ - అన్నీ కలిసి ఏక శబ్దంగా తోస్తోంది. గత రెండునెల్లనుంచీ సముద్రపు నీటిమీదనే నివసించిన నావికులు - పట్టణాలకు అలవాటు కాని జీవుల్లాగు వీధుల్లో ఇద్దరిద్దరుగా మెల్లిగా తమ నడకను సాగించారు. రెండునెల్లనుంచీ వారిలో క్రమంగా పెరిగి పెద్దదైన 'ఆకలి' తో వీధుల్లోని గాలిని పరీక్షగా పీలుస్తూ ఒకరివైపు ఒకరు చూసుకోసాగారు. వారు నేలమీద ప్రయాణం సాగించినప్పుడు పెర్రీ మార్గదర్శకుడిగా ఉండేవాడు. పెర్రీ తన అభిరుచులకు సరిపడే మార్గాల్ని అన్వేషిస్తూ, మిగతా అందరికీ ఇష్టమైన ప్రదేశాలకు తీసుకు వెళ్లేవాడు. ఓడరేవు పట్టణాల్లో నావికులు కొని తెచ్చుకునే వింతవింత పోట్లాట్లలో అతను పాల్గొనే వాడుకాదు; కాని ఏ కారణంచేతనన్నా పాత్ర తీసుకుంటే మాత్రం - ఎవరన్నా అతనికి భయం లేదు.

కొంతసేపు పట్టణంలో తిరిగాక - పెర్రీ ఒక వంకరటింకర సందుల్లోకి దారి తీశాడు. ఆ వీధిలోని ప్రతి ఇంటిగుమ్మం ముందూ - మధ్య తరగతి ప్రజల దుస్తులు

ధరించిన ఒక్కో స్త్రీ కూర్చొనివుంది. నావికులు సమీపించగానే గౌరవంగా వారు నిలబడి - దాదాపు వారిదారిని అడ్డగించసాగారు. ఈ కాస్త విశ్రాంతి కాలంలోనూ తమకు లభించే యీకొద్ది ఆనందంకోసమూ ఆతృతపడే ఆ జీవులు - ఈ వేశ్యావాటిక గాలిని ఆతృతతో పీలుస్తూ, తమ కుతూహలాన్ని సన్నని దగ్గరూపాన రూపిస్తూ - తమ వింత అభిరుచులతో వారిని పరీక్షించసాగారు. వేశ్యలు బందవారిన తమ కంఠధ్వనితో వాగ్దానాల్తో కూడిన ఆహ్వానాల్ని జారీ చేస్తున్నా - ఎరనిచూసిన చేపల్లాగు ఆతృతపడే నావికులు క్షణక్షణానికి కుప్పలు కుప్పలుగా ఎదురయ్యే ఇన్ని అవకాశాల్ని ఆశాభంగంతో ఎదుర్కుంటూన్నా - ఇంత మురికిరకం వేశ్యల్ని అనుభవించలేక ఇంకోవీధికి దారితీశారు; రాజబాట మీదినుంచీ ఆ ప్రక్కల అన్ని సందుల్లోకీ నావికులూ, వర్తకులూ, సైనికులూ - ఇతర జనమూ, ఎవరి తోవను వారు వెతుక్కుంటూ, ప్రవేశిస్తున్నారు ...బైటికి శుభ్రంగా కనిపించే ఒక పెద్ద ఇంటితో తృప్తిపడి - పెర్రీ తన స్నేహితులతో - ఆ ఇల్లు ప్రవేశించాడు.

## 2

నాలుగుగంటలసేపు వారు ఆ యింటి యజమానులయ్యారు. బ్రాందీ, ప్రేమా రెండే వారిలోకం! ఆరునెలల జీతంతో వారు యీ ఆనందాన్ని కొనుక్కున్నారు. కింద పెద్దహాలులో ఎవరికి వారు కుర్చీల్లో కూర్చొని తాగుతూ - తమకు ఇష్టం వచ్చిన యువతిని ఎన్నుకొన్నారు. మేడ మీది గదులకువెళ్ళే మెట్లమీద నాలుగేసి కాళ్లు ఎక్కటమూ, దిగటమూ - విసుగులేకుండా సాగుతోంది.

వారికి బాగా మత్తెక్కాక ఒక్కొక్కరే మూలగటం ప్రారంభించారు. ఎర్రబడ్డకళ్ళతో ఒళ్ళోకూర్చున్న ప్రియురాల్ని చూస్తూ, ముందున్న టేబిల్ మీదనో ప్రియురాలి భుజ మీదనో తాళంవేస్తూ - పిచ్చిపాటలూ పాడుతూ, మధ్యమధ్య తాగదల్చుకున్న బ్రాందీలో సగభాగాన్ని తూలి, మీద పోసుకుంటూ వారా రాత్రి గడిపారు.

ఒకపక్క పెర్రీ ఒళ్ళోకూర్చున్న ప్రియురాలి ఎర్రబడ్డ చెక్కిళ్ళవైపు ఆశగా చూస్తున్నాడు. ఇతర్లకన్న తక్కువగా తాగకపోవటంవల్ల కాకపోయినా, ఇతర తలపులవల్ల ఆతనికి అంతగా కై పెక్కలేదు. ఇతరులకన్న మృదువైన అతని హృదయం యీనాటి ప్రియురాలితో చిన్న సంభాషణకు ఆశపడ్డది. కాని అతని ఊహలు అటూ ఇటూ పరుగులెత్తి తను గ్రహించకపూర్వమే మాయమౌతూండటంవల్ల సరిగ్గా తనేం మాట్లాడదల్చుకున్నాడో - దానికి మారుగా ఇంకోమాటల్లోకి దారితీశాడు. కొంత తెలివి తెచ్చుకొని కొంతవరకూ మతివుంచుకునేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు:

"ఎంతకాలం...ఎంతకాలం...నువ్విక్కడికివచ్చి ఎంతకాలమయింది?"

"ఆరు నెలలు-" అంది, ఆ యువతి.

ఇది ఆమె సత్ప్రవర్తనను కొంతవరకూ రుజూ చేస్తుంది. కనుక, అతనికి తృప్తి కలిగి, మళ్ళీ ప్రశ్నించాడు; "ఈ జీవితమంటే నీకు ఇష్టమేనా?"

ఆమె ముందు కాస్త అనుమానించి, తరువాత నవ్వి అంది: "ఇది అలవాటై పోతుంది. ఇతర జీవితాలకన్న ఇదేమంత ఎక్కువ బాధాకరమైంది కాదు...దాసీగా బతకటం - మరీ అసహ్యం!"

ఈ సత్యాన్ని తనూ ఆమోదిస్తున్నట్టు చూసి, "మీది యీ వూరేనా?" అన్నాడు పెర్రీ. ఆమె ఒక్క తలవూపుతో సమాధానం ఇచ్చింది.

"దూరపు గ్రామంనుంచి వస్తున్నావా?"

ఆమె పెదవులు కదల్చకుండానే, మళ్ళీ తలవూపింది.

"మీది ఏ వూరూ?"

ఆమె ఆలోచిస్తూన్నట్టు కనబడింది. ఆలోచనను సరిచేసుకొని గర్వంగా అంది; "పెర్పిగ్నన్-"

"ఉహు" అన్నాడు పెర్రీ, ఇంకోసారి తృప్తి కలిగినట్టు.

ఇప్పుడు ప్రశ్నించటం తనవంతయినట్టు ఆమె అడిగింది; "మరి మీరో?... మీరు నావికులా?"

"అవును-"

"మీరు దూరదేశంనుంచి వస్తున్నారా?"

"నేను దేశాల్నీ, ఓడరేవుల్నీ, పట్టణాల్నీ - ఎన్నింటినో చూశాను."

"గోళమంతా చుట్టివచ్చారనుకుంటాను."

"ఒకసారికాదు-రెండుసార్లు!"

"మీ ప్రయాణాల్లో చాలా ఓడల్ని కలుసుకొని వుంటారుకదూ."

"ఓ...చాలా!"

"నాటర్‌డామ్ అనే ఓడను చూశారా?"

"ఈ వారంలో కూడా చూశా...ననుకుంటాను."

ఎర్రని ఆమె చెక్కిళ్ళు తమ రంగును పోగొట్టుకున్నయ్.

అంది: "ఇది నిజమేనా?...నిజంగా చూశారా?"

"నిజమే...నిజంగా!"

"మీరు నాతో అబద్ధమాడటం లేదుకదూ?"

అతను చేయెత్తి, "భగవంతుడి సాక్షిగా - నిజం చెప్తున్నాను" అన్నాడు.

"ఐతే, పెర్రీ - ఇంకా ఆ ఓడలోనే ఉన్నాడో లేదో మీకు తెలుసా."

అతను ఆశ్చ్యపడి, యిబ్బందిగా అటూ ఇటూ కదిలి - ఆమె ప్రశ్నకు జవాబిచ్చేముందు, ఇంకా కొంత తెలుసుకోవాలని, "అతను నీకు తెలుసా?" అని అడిగాడు.

ఆమెకూడా అతన్ని నమ్మదలచక అంది: "నాకు తెలియదు - అతనితో పరిచయంవున్న ఒక స్త్రీ–"

"ఇక్కడి వొక స్త్రీయా?"

"కాదు–ఇక్కడికి దగ్గరి వీధిలో ఉంటూన్న ఒక స్త్రీ–"

"...వీధిలోనా?...ఏ స్త్రీ?"

"ఏ స్త్రీ ఐతేనేం - ఒక స్త్రీ - నాలాటి ఒకామె–"

"ఐతే...అది - ఆ స్త్రీ...అతనితో ఏం చెప్పాలనుకుందీ?"

"ఆమె అతని గ్రామస్తురాలే ననుకుంటాను."

తమమధ్య ఏదో గొప్పవిశేషం జరగబోతూన్నట్టు వారు ఒకర్నొకరు తీక్షణంగా చూసుకున్నారు.

అతను అన్నాడు : "నేను ఆమెను చూస్తే?"

"మీరు ఆమెతో ఏం చెప్తారు?"

"నేను... నేను చెప్తాను; పెర్రీని చూశానని–"

"అతను కులాసాగా ఉన్నాడు - అవునా?"

"నీలాగా, నీలాగా అతి కులాసాగా ఉన్నాడు...అతను బలే సరదా పురుషుడు!"

ఆమె తన ఊహలన్నింటినీ కూడదీసుకునేందుకు కాస్త ఆగి, "నాటర్‌డామ్ - ఎక్కడికి వెళ్ళిందీ?" అని అడిగింది.

"ఇప్పుడే...మార్సెల్లీసుకు–"

ఆమె ఒక్కసారిగా తూలి, "ఇది నిజంగా..నిజమేనా?" అంది.

"నిజంగానే!"

"మీకు పెర్రీ తెలుసా?"

"నాకు బాగా తెలుసు."

ఆమె కాస్త ఆగి, మృదువుగా అంది: "....మంచిది–"

"అతనితో నీకేం పని?"

"వినండి...అతనితో మీరు చెప్పండి...ఏంలేదు?"

అతను మరింత ఆశ్చర్యంపడి ఆమెవైపు తీక్షణంగా చూశాడు, చివరకు, అన్నాడు: "నీక్కూడా అతను తెలుసా?"

"ఉహు."

"మరి అతనితో నీకేం పని?"

తను ఏంచెయ్యాలో ఆమెకు అప్పుడే తోచింది. ఉన్నట్టుండి - ఒక గ్లాసు నిమ్మరసం తెచ్చి, "ఇది తాగండి - " అంది.

"ఎందుకూ."

"తాగిన పైత్యం కొంత విరుగుతుంది-"

అతను మారుమాట్లాడకుండా తాగి, పెదవులు తుడుచుకుంటూ, "సరే... ఏం చెప్తావో చెప్పు-వింటున్నాను-" అన్నాడు.

"మీరు నన్ను చూశానని అతనితో చెప్పనని వాగ్దానం చెయ్యండి. మీరు ఇప్పుడు వినబొయ్యేదాన్ని ఎవరిదగ్గర్నించి విన్నారోకూడా చెప్పరాదు.. ప్రమాణం చెయ్యండి-"

అతను ప్రమాణం చేశాడు.

"భగవంతుడి సాక్షిగా?" అందామె.

"అవును-భగవంతుడి సాక్షిగా!"

"ఐతే అతనితో చెప్పండి; అతని తండ్రి చనిపొయ్యాడు; అతని తల్లి చనిపోయింది; అతని తమ్ముడు చనిపొయ్యాడు. నాలుగు సంవత్సరాల వెనుక - ముగ్గురూ - టైఫాయిడ్ జ్వరంతో ఒక్క నెలలో పొయ్యారు-"

ఈ మాటలు వినగానే అతని రక్తం అతి వేగంతో శరీరమంతటా ప్రహించ సాగింది. అతను వెంటనే మాట్లాడలేక పొయ్యాడు. తరువాత ఆమె మాటల్ని అనుమానిస్తూ, "నీకిది బాగా తెలుసా?" అన్నాడు.

"బాగా తెలుసు."

"ఎవరు చెప్పారు?"

ఆమె తన రెండు చేతుల్నీ అతని భుజం మీదవేసి, లోతైన తన చూపుల్తో అతని కళ్ళల్లోకి చూస్తూ, "ఈ సంగతి ఎవరితోనూ చెప్పనని ప్రమాణం చేస్తే-?" అంది.

అతను మళ్ళీ ప్రమాణం చేశాడు.

ఆమె మెల్లిగా అంది: "నేను అతని - చెల్లెల్ని!"

ఆమె పేరును అతనే ఉచ్చరించాడు: "రోజ్!"

ఆమెకిదేమీ అర్థంకాక, ఒక్క క్షణం ఆశ్చర్యంతో అతని ముఖంలోకి చూసి, అమితంగా భయపడి, కాస్సేపు మాటలు వెతుక్కొని దాదాపు అతని నోటిదగ్గరగా, "పెర్రీ!" అనగలిగింది.

వారు కదలలేకపొయ్యారు; చూపులు గాఢంగా కలుసుకుపొయ్యాయ్. వారి చుట్టుపక్కల నావికులింకా ప్రియురాళ్ళతో కలిసి ఊగుతూ, మూలుగుతున్నారు. వారు టేబిల్మీది గాజుగ్లాసుల్ని ఎత్తి పెడుతూన్న శబ్దమూ, గొణిగే పాటలకు కాలితో నేలమీద వేసే తాళాలూ, ఉద్రేకంతో కూడిన వారి ఒత్తిడికి నలిగే వేశ్యల మూలుగులూ - ఇన్ని శబ్దాలూ ఒక దాంట్లో ఒకటి కలిసిపోతున్నయ్.

ఆమె అతని మీదుగా ఒరిగి, అతన్ని కావిలించుకొని - తను అతని సోదరయినందుకు అమితమైన సిగ్గుతో కూడిన భయంతో చూడసాగింది. ఇతర్లు వినిపోతారనే భయంతో... అతనికి మాత్రమే వినపడేట్టు ఆమె అతి రహస్యంగా అంది: "ఎంత దురదృష్టం!"

మరుక్షణానే ఆమె కళ్ళు నీళ్ళతో నిండినయ్, అంది: "ఇది నా తప్పా?"

అతను ఉన్నట్టుండి అన్నాడు: "ఐతే వాళ్ళందరూ చనిపొయ్యారు?"

"అవును - చనిపొయ్యారు"

"తండ్రీ, తల్లీ, తమ్ముడూ-"

"ముగ్గురూ ఒక్క నెలలోనే పొయ్యారు. కట్టుబట్టల్తో నేను మాత్రమే మిగిలాను. వారి అంత్యక్రియలకూ, డాక్టరు ఫీజులకూ, ఇతర బాకీలకూ ఇంట్లో సామాను పోయింది. తరువాత నేను జాన్ గారింట్లో దాసీగా ప్రవేశించాను. అప్పటికి నా వయస్సు పదిహేనేళ్ళు; యవ్వనం ప్రవేశించగానే మానవుడికి బుద్ధి ఉండదు. జాన్ నన్ను తన ప్రియురాలిగా ఉపయోగించుకున్నాడు. తరువాత హాస్పిటల్లో నర్స్గా జేరాను. అక్కడకూడా నేను వ్యభిచారానికే ఎక్కువగా ఉపయోగపడ్డాను. ఒక కాంపొండరు - నాకోసం ప్రత్యేకంగా వేరే ఇల్లుతీసుకొని, కొన్నాళ్ళపాటు అతిప్రేమగా చూశాడు. తరువాత ఉన్నట్టుండి అతను ఇంటికి రావటం మానుకున్నాడు. మూడు రోజులపాటు నేను భోజనం చెయ్యలేదు. ఏ ఉద్యోగానికీ నేను పనికి రాకపోవటంవల్ల నాలాటి నిర్భాగ్యులు అనేకమంది వెళ్ళే ఇంటికి వెళ్ళాను.. ఈ విధంగా నేనూ ఏడెనిమిది పట్టణాల్ని చూశాను. చివరకు మార్సెలీస్ జేరాను-"

ఆమె కంటినుంచి వెలువడే కన్నీరు, ముక్కుమీంచి జారి, ఆమె గౌనులో మాయమౌతోంది.

అతను అన్నాడు: "నేను అనుకున్నాను - నువ్వు కూడా చనిపోయి వుంటావని - నేను ఇల్లు వదిలి వెళ్ళేప్పటికి నువ్వు చాలా చిన్నదానివి... ఇప్పుడు ఎంత

పెద్దదానివయ్యావ్! నేను నిన్ను గుర్తుపట్టలేకపోయ్యాను... నువ్వు నన్నెందుకు గుర్తుపట్టలేదు?"

ఆమెచేతులు తిప్పుతూ అంది: "నేను అనేకమంది పురుషుల్ని చూస్తూంటాను. నాకు అందరూ ఒకే విధంగా కనిపిస్తారు–" అతనింకా ఆమెవైపే దీక్షగా చూస్తున్నాడు. ఆమె అతని ఆత్మను తీరని గాయాన్ని చేసింది; కొరడాదెబ్బలు తిన్న చిన్న పిల్లాడిలాగు చాలాసేపు ఏడుద్దామనిపించింది. అతనింకా ఆమె భుజాల మీద చేతులువేసి ఆమెవైపు చూడటాన్ని మానలేదు.. ఈ విధంగా ఇంతసేపు చూశాక కాని అతనామెను గుర్తించలేదు. తను ఇల్లు వదిలి వెళ్ళాక – తన ఆత్మబంధువుల మరణాలన్నిటినీ చూసిన – సోదరి! ఆమెను రెండు చేతుల్లోకీ తీసుకొని–ఆత్మశక్తి మీద చూపే ఆపేక్షతో ఆమెను ముద్దాడాడు. పురుషుని హృదయాంతరాళంలో బయలుదేరి సముద్రపుటలలలాగు బైటికురికే దుఃఖతరంగాలతో అతని గొంతు నిండిపోయింది.

అతను బాధతో అన్నాడు: "నువ్వు..నువ్వు...రోజ్‌వి!"

తరువాత ఉన్నట్టుండి అతను ఎగిరి గంతేసి, పిచ్చిలా ఏదో మాట్లాడుతూ బలంగా టేబిల్‌మీద పడ్డాడు; అక్కడి గాజుగ్లాసులన్నీ కిందపడి పగిలిపోయినయ్. తరువాత బరువుగా చూడకుండా ముందుకు చేతులు వేసి రెండూ ముందుకు జాచి, కిందపడి – కాళ్ళూ, చేతులూ ఆత్మీయంగా ఆడిస్తూ మృత్యువుకు భయపడి మానవుడిలాగు మూలుగుతూ, కింద దొర్లసాగాడు....మిగతా స్నేహితులందరూ అతన్ని చూసి నవ్వారు.

"వీడు బాగా తాగాడు!" అన్నాడు ఒకడు.

"వీణ్ని పక్కమీద పడెయ్యటం– మంచిది" అన్నాడు ఇంకొకడు.

"వీడు వీధినపడితే – మనందరికీ పని తగులుతుంది" అన్నాడు మరొకడు.

అతని జేబులో ఇంకా కొంచెం డబ్బులుండటంవల్ల – ఆ ఇంటి యజమానురాలు – అతను ఆ రాత్రి అనుభవించిన యువతి గదిని ప్రత్యేకించి ఇచ్చేందుకు ఒప్పుకుంది. నిషాతో తూలుతున్న అతని మిత్రులు – మెల్లిగా అతన్ని మేడమీది ఆమె గదికిజేర్చి – కిందికివచ్చేశారు. ఈ రాత్రి అతనికి స్త్రీ ఇచ్చే ఆనందాన్నిచ్చిన ఆమె – తీరని నేరం జరిగిన ఆ పక్కదగ్గర – అతని పాదాలకు సమీపంగా కూర్చొని – అతనిలాగే స్వేచ్ఛగా తెల్లారేవరకూ ఏడ్వసాగింది.